క్లుప్తంగా

బదిలీ దరఖాస్తుకు అవకాశం కల్పించాలి

ఎదులాపురం: బదిలీ దరఖాస్తులకు అవకాశం కల్పించాలని ఉపాధ్యాయులు కోరారు. సోమవారం జిల్లా విద్యాశాఖ అధికారి ప్రణీతకు వినతిపత్రం అందజేశారు. ఆయా సంఘాల సభ్యులు మాట్లాడుతూ.. ఉన్నతాధికారులతో చర్చించి ప్రధానోపాధ్యాయులకు తగిన ఆదేశాలు జారీ చేయాలని కోరారు. కార్యక్రమంలో డి.అశోక్ కుమార్, ఆర్.బలిరాం, తొడసం కైలాస్ పాల్గొన్నారు.

రిమ్స్ ల్యాబ్‌ను పరిశీలించిన డీఎంవో



రికార్డులు పరిశీలిస్తున్న డీఎంవో శ్రీధర్

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్‌లోని మలేరియా ల్యాబ్‌ను జిల్లా మలేరియా నివారణ అధికారి మెట్‌పెల్లివార్ శ్రీధర్ తనిఖీ చేశారు. సోమవారం ల్యాబ్‌లో నమూనాలను పరిశీలించి పలు రికార్డులను తనిఖీ చేశారు. జ్వర బాధితుల రక్త నమూనాలను తీసుకున్నప్పుడు తప్పనిసరిగా మలేరియా పరీక్షలు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు.

'బెంగాలీ ఆర్‌ఎంపీలపై చర్యలు తీసుకోవాలి'



ఎస్సైకి ఫిర్యాదు చేస్తున్న నాయకులు

బేల: ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న బెంగాలీ ఆర్‌ఎంపీలపై చర్యలు తీసుకోవాలని యూత్ కాంగ్రెస్ నాయకులు సోమవారం ఎస్సై కృష్ణకుమార్‌కు ఫిర్యాదు చేశారు. నియోజకవర్గం కన్వీనర్ సామ రూపేష్‌రెడ్డి మాట్లాడుతూ.. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ నుంచి ఎలాంటి అనుమతి లేకుండా గ్రామాల్లో ప్రత్యేక క్లినిక్‌లు ఏర్పాటు చేసి హైడోస్ ఇంజక్షన్లు వేస్తున్నారని ఆరోపించారు. ఏజెన్సీ ప్రాంతంలో వారి వైద్యాన్ని విస్తరించి, మందులు అంటగడుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు మడావి చంద్రకాంత్, ఎండీ అఖిల్, చంద్రకాంత్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శోభాయాత్ర



హనుమాన్ విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు

జైనథ్: మండలంలోని సాంగ్వి గ్రామంలో పంచముఖి హనుమాన్ విగ్ర ప్రతిష్ఠాపన కార్యక్రమం సందర్భంగా సోమవారం భాజాభజంత్రీల నడుమ శోభాయాత్ర నిర్వహించారు. ఈనెల 1న విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

ప్రణాళికాబద్ధంగా చదివితేనే ప్రభుత్వ కొలువు



మాట్లాడుతున్న జనార్దన్

కైలాస్‌నగర్: ప్రణాళికాబద్ధంగ చదివితే ప్రభుత్వ కొలువు సాధించవచ్చని శంకరన్ ఐఏఎస్ అకాడమీ ఫ్యాకల్టీలు జనార్దన్ దండు, ప్రభాకర్ చౌటి అన్నారు. సోమవారం తెలంగాణ ఆదివాసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని జెడ్పీ సమావేశ మందిరం సివిల్స్, గ్రూప్స్ పోటీ పరీక్షలపై అవగాహన సదస్సు నిర్వహించారు. పరీక్షల్లో అనుసరించాల్సిన మెళుకువలు, సన్నద్ధతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శంకరన్ ఐఏఎస్ అకాడమీ పరిపాలన అధికారి కోట సతీష్, ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ రమేష్ పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

ఎదులాపురం: టీఆర్‌ఎస్‌ఎంఏ సంఘం క్యాలెండర్‌ను జిల్లా విద్యాశాఖ అధికారి ప్రణీత ఆవిష్కరించారు. సోమవారం సంఘం సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. డీఈవో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యనందించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పురుషోత్తం, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆదినాథ్, సాయిని రవికుమార్, రాము, తదితరులు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం



కల్యాణం జరిపిస్తున్న అర్చకులు



హాజరైన భక్తులు

జైనథ్: మండలంలోని కూర గ్రామంలో వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. ఎంపీపీ మార్శెట్టి గోవర్ధన్, సర్పంచ్ అడ్డి లత, ఆలయ కమిటీ సభ్యులు పద్మావతి స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం అమ్మవార్లను ముస్తాబు చేసి కల్యాణోత్సవాన్ని శోస్త్రోక్తంగా జరిపించారు. సాయంత్రం గరుడ వాహనంలో స్వామి వారి విగ్రహాలను ప్రతిష్ఠించి శోభాయాత్ర నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షులు పాయల్ శంకర్, మాజీ జెడ్పీ చైర్మన్ చిట్యాలా సుహాసినిరెడ్డి, మహిళలు పాల్గొన్నారు.

'ఉపాధి'కి ఆధార్ లింక్

- జాబ్‌కార్డులకు తప్పనిసరి
- బోగస్ జాబ్‌కార్డులకు చెక్
- ఆధార్ అనుసంధానం చేస్తున్న ఈజీఎస్ బృందం



ఆధార్ లింక్ చేస్తున్న ఈజీఎస్ బృందం

బేల: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో బోగస్ జాబ్‌కార్డులకు చెక్ పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ పథకంలో మరింత పారదర్శకత కోసం కూలీల జాబ్ కార్డులకు ఆధార్ అనుసంధాన ప్రక్రియకు మార్గదర్శకాలు జారీ చేసింది. ఈప్రక్రియ నెలరోజులుగా కొనసాగుతోంది. ఆధార్ అనుసంధానం పూర్తయితే ఉపాధి పనులు చేసిన కూలీలకు ఎటువంటి ఇబ్బంది తలెత్తకుండా సకాలంలో బ్యాంకు ఖాతాల్లోకి డబ్బులు జమ కానున్నాయి.

ఆధార్ లింక్ ఇలా..

ఇప్పటికే జాబ్‌కార్డులు ఉన్న వారికి ఆధార్ నంబరు అనుసంధానం చేస్తారు. ఒకవేళ ఆధార్ నంబరు అనుసంధానం అయి ఉంటే పరిశీలన చేస్తూ కూలీల ఆధార్ కార్డులో పేరు, ఇతర వివరాలు ఎలా ఉంటే అలా జాబ్‌కార్డులో నమోదు చేస్తున్నారు. గత నెల రోజులుగా ఈప్రక్రియలో ఈజీఎస్ బృందం సభ్యులు నిమగ్నమయ్యారు. మండలంలో 37గ్రామ పంచాయతీలున్నాయి. ప్రస్తుతం 6వేల వరకు జాబ్ కార్డులున్నాయి. ఇందులో 13, 420మంది కూలీలు ఉన్నారు. ఏటా సీజన్‌లో ఈ జాబ్‌కార్డుల్లో 6,500 మంది వరకు కూలీలు క్రియాశీలకంగా ఉపాధి పనులు చేస్తున్నారు. ఇప్పటికే 13,200 మంది కూలీలకు జాబ్‌కార్డులకు ఆధార్ అనుసంధానం పూర్తి చేశారు. 12,701 మంది కూలీల అనుసంధానం విజయవంతం కాగా, 497మంది అనుసంధానం ఫెయిల్ అయింది. ఇందులో 4,214 మంది కూలీలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా నేరుగా డబ్బులు చెల్లింపుకు ప్రక్రియ (ఏబీపీఎస్) పూర్తయింది.

కూలి డబ్బులు చెల్లింపులకు ఇబ్బందులు..

జాబ్‌కార్డులకు ఆధార్ అనుసంధానం చేయకపోతే పని దరఖాస్తు తీసుకోబడదు. ఒకవేళ ఏమైనా చేసిన ఉపాధి పనులకు కూలి డబ్బులు రావు. జాబ్‌కార్డులు సైతం బోగస్ జాబ్‌కార్డులుగా నిర్ధారణ అవుతాయి. ఒక జాబ్‌కార్డులో ఎందరు ఉంటే అందరి ఆధార్ అనుసంధానం చేసుకోవాలి. లేదంటే చెల్లింపులకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఈజీఎస్ బృందం వారు చెబుతున్నారు.

ఆధార్ లింకు చేసుకోవాలి

మండలంలోని 13,420 మంది కూలీలకు 12,701మంది కూలీలకు జాబ్‌కార్డులకు ఆధార్ కార్డు లింక్ ప్రక్రియ విజయవంతంగా పూర్తి చేశాం. ఆధార్ లింక్ చేయనట్లైతే కూలీలు చేసిన ఉపాధి పనులకు డబ్బుల చెల్లింపు ఏమాత్రం రావు. దీన్ని గుర్తించి, జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరు ఆధార్ లింక్ చేసుకోవాలి.

– శ్యామూల్, ఏపీవో ఈజీఎస్

గాంధీజీ ఆశయసాధనకు కృషి చేయాలి



నేరడిగొండ: నివాళులర్పిస్తున్న నాయకులు



ఉట్నూర్‌రూరల్: నివాళులర్పిస్తున్న ఎంపీపీ

ఇంద్రవెల్లి: గాంధీజీ ఆశయసాధనకు కృషి చేయాలని జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ అంజద్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని హెల్ప్ వీల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ వర్ధంతి నిర్వహించారు. గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గిత్తే ఆశబాయి, కోరెంగా సుంకట్‌రావ్, ఫౌండేషన్ వ్యవస్థాపకులు అతిష్, భాస్కర్, పరత్వాగ్ దత్త, సుఫీయన్, సత్యానంద్ పాల్గొన్నారు.

నేరడిగొండ: గాంధీజీ ఆశయ సాధన కోసం పని చేయాలని కాంగ్రెస్ మండల కన్వీనర్ ఆడె వసంత్ రావు కోరారు. సోమవారం మండల కేంద్రంలో గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తేజాపూర్ సర్పంచ్ అల్లూరి ప్రఫుల్‌చందర్ రెడ్డి, జాదవ్ వసంత్‌రావు, ఏలేటి రాజశేఖర్ రెడ్డి, నాయిడి రవీందర్, రాజాగౌడ్, అరుణ్‌గౌడ్, అమృత్‌లాల్, గడ్డం నరేష్‌రెడ్డి పాల్గొన్నారు.

తలమడుగు: మండలంలోని ఖోడథ్ ప్రభుత్వ పాఠశాలలో మహాత్మా గాంధీ వర్ధంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులు గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. హెచ్‌ఎం కృష్ణకుమారి, ఉపాధ్యాయులు లక్ష్మి, విజయలక్ష్మి, సురేఖ, సుకుమార్ పెట్కులే, కిరణ్ కుమార్, మమత పాల్గొన్నారు.

బోథ్: మండల కేంద్రంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో సోమవారం గాంధీ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి, మండల కన్వీనర్ మహేందర్, షేక్ నాజర్ అహ్మద్, మహమ్మద్, రాజశేఖర్, భోజన్న, గంగాధర్, శేఖర్ పాల్గొన్నారు.

తాంసి: భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటి పాఠశాలలో సోమవారం అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రాథమిక పాఠశాలలో గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం జ్యోతి, ఉపాధ్యాయులు శంకర్, రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

జైనథ్: మండల కేంద్రంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో గాంధీ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. సోమవారం గాంధీ చిత్రపటానికి నివాళులర్పించి, జాతీయ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు భీంరెడ్డి, పిడుగు స్వామి, సయ్యద్ షాబీర్, రెంజర్ల రాజన్న, సంజీవ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్: మహాత్మా గాంధీ వర్ధంతిని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో నిర్వహించారు. ఎంపీపీ పంద్ర జైవంత్‌రావు గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో తిరుమల, సర్పంచ్‌లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కుష్ఠు నిర్మూలనకు కృషి చేయాలి



గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న వైద్యాధికారి

తాంసి: కుష్ఠు నిర్మూలనకు ప్రతిఒకరూ కృషి చేయాలని మండల వైద్యాధికారి శ్రావ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో ప్రజలకు అవగాహన కల్పించారు. వ్యాధి లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఈసందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ.. కుష్ఠు వ్యాధి అనేది 2 నుంచి 5 సంవత్సరాల తరువాత లక్షణాలు బయటకు వస్తాయన్నారు. మొదటి దశలోనే గుర్తిస్తే నయం చేయవచ్చన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కృష్ణ, సూపర్‌వైజర్ తులసీరాం, హెల్త్ అసిస్టెంట్ నగేష్, అంగన్‌వాడీ టీచర్లు భాగీర్థ, సరిత, విజయలక్ష్మి, గ్రామస్తులు పాల్గొన్నారు.

'కంటివెలుగు' పరిశీలన

ఆదిలాబాద్‌రూరల్: మావల మండలంలోని టీచర్స్ కాలనీలో గ్లోబల్ స్కూల్‌లో నిర్వహించిన కంటి వె లుగు శిబిరాన్ని మావల తహసీల్దార్ వనజారెడ్డి సో మవారం పరిశీలించారు. కంటివెలుగు శిబిరాల ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించా రు. కార్యక్రమంలో ఆర్‌ఐ హన్మంత్ రావ్, కౌన్సిలర్ అశోక్, తదితరులు పాల్గొన్నారు.

'సమాచార హక్కు చట్టంపై స్పందించని అధికారులు'

ఉట్నూర్‌రూరల్: ప్రభుత్వం ప్రవేశపెట్టిన సమాచార హక్కుచట్టం ద్వారా సమగ్ర సమాచారం ఇవ్వాలని కోరుతున్న అధికారులు పట్టించుకోవడం లేదని గిరిజన నాయకుడు చౌహాన్ రాము అన్నారు. సోమవారం స్థానిక ప్రెస్‌భవన్‌లో మాట్లాడారు. బజార్‌హత్నూర్ మండలంలోని మన్నాపూర్ ప్రాంతంలో మహారాష్ట్ర నుంచి వలస వచ్చిన వారికి రెవెన్యూ అధికారులు అక్రమంగా హక్కుపత్రాలు ఇచ్చారని ఆరోపించారు. తమకు చెందిన భూమిని రెవెన్యూ అధికారులు ఎలాంటి ఆధారాలు లేకుండానే వారికి హక్కు పత్రాలు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. ఇప్పటికైనా గిరిజనుల సమస్యలపై అధికారుల స్పందించాలని కోరారు. సమావేశంలో శ్రీరాం, లక్ష్మణ్, ఆత్రం భారత్ రావు, రమేశ్ పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణుల కార్యవర్గం ఎన్నిక

బోథ్: మండల కేంద్రంలోని ధర్మశాలలో విశ్వబ్రాహ్మణ మండల కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా అల్లి రఘుపతి, అధ్యక్షుడిగా చాబంతుల శ్రీకర్, ప్రధాన కార్యదర్శిగా శ్రీమంతుల శ్రీనివాస్, కోశాధికారిగా ఎర్రోజు ఆనందం, ఉపాధ్యక్షుడిగా మేడిచెల్మ ప్రవీణ్, మౌళి జీవన్, సహ కార్యదర్శిగా శ్రీరామోజీ వెంకటేష్, కొనగంటి శేఖర్, ప్రచార కార్యదర్శిగా మంత్రి శ్యాంసుందర్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పాలిక్ రమేష్, బూరుగు రాజేందర్‌లు పాల్గొన్నారు.

నేతకాని మహార్ సంఘం రాష్ట్ర మహిళ అధ్యక్షురాలిగా సోంబాయి

కైలాస్‌నగర్: నేతకాని మహార్ సంఘం మహిళ విభాగం రాష్ట్ర అధ్యక్షురాలిగా ఆదిలాబాద్ పట్టణం టీచర్స్‌కాలనీకి చెందిన సర్పే సోంబాయి ఎన్నికయ్యారు. ఈసందర్భంగా సోమవారం ఆమెను సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు కుశ్వార్థబాయ్ లంఢ్గే, సభ్యులు ఉజ్వల, మాయావతి ససానే, ఆమ్రపాలి, వైజయంతి పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ప్రయాణం..



ఇచ్చోడ: ప్రమాదం అని తెలిసినా.. గిరిజనులు ప్రైవేట్ వాహనాల్లో ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారు. సోమవారం సిరిచెల్మ నుంచి ఇతర గ్రామాలకు ఆటో టాప్‌పై ఎక్కి ప్రయాణిస్తున్నారు. ఈదృశ్యాన్ని 'సాక్షి' క్లిక్ మనిపించింది. గిరిజన గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

కాంగ్రెస్‌తోనే దేశాభివృద్ధి సాధ్యం



తలమడుగు: నివాళులర్పిస్తున్న నాయకులు



ఇచ్చోడ: జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు



నార్నూర్‌లో..

నార్నూర్: కాంగ్రెస్‌తోనే దేశ అభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు యుసుఫ్‌ఖాన్ అన్నారు. సోమవారం భారత్‌జోడో యాత్ర ముగింపు సందర్భంగా మండల కేంద్రంలో పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కరెంట్ చార్జీలు, బస్సు చార్జీలు, ధరణి రిజిస్ట్రేషన్ పేరుతో ప్రజలను దోచుకుంటున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు కైలాష్ జాదవ్, కరీంఖాన్, మానిక్‌రావు ఆడే, షేక్ సత్తార్, తొడసం విష్ణు, రమేశ్, కార్తీక్ రాథోడ్ పాల్గొన్నారు.

తలమడుగు: రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర ముగింపు సందర్భంగా మండల కేంద్రంలో కాంగ్రెస్ మండల కన్వీనర్ కల్యాణం రాజేశ్వర్ జెండా ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని గ్రామాల్లో కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గణేశ్‌రెడ్డి, ప్రతాప్, రఫీక్, గంగన్న, వెంకన్న పాల్గొన్నారు.

కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలి

ఇచ్చోడ: కాంగ్రెస్ అధికారంలోకి తీసుకువచ్చేందుకు కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని ఇచ్చోడ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహిమూద్‌ఖాన్ అన్నారు. భారత్ జోడోయాత్ర ముగింపుకు సంఘీభావంగా సోమవారం పార్టీ కార్యాలయంలో జెండాను ఆవిష్కరించారు. అనంతరం గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కల్లెం నారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, ఎంపీటీసీ జాహెద్, ఎస్సీసెల్ చైర్మన్ కొత్తూరి లక్ష్మణ్, మైనార్టీ సెల్ చైర్మన్ ముస్తాఫా, జిల్లా కార్యదర్శి భీమన్న పాల్గొన్నారు.

బేల: మండల కేంద్రంలోని మార్కెట్ కూడలిలో సోమవారం జాతీయ జెండా ఆవిష్కరించారు. రాహుల్‌గాంధీ భారత్ జోడోయాత్ర ముగింపు సందర్భంగా ఈకార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం మహాత్మా గాంధీ వర్ధంతి నిర్వహించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఫైజుల్లాఖాన్, మాజీ జెడ్పీటీసీ నాక్లే రాందాస్, గుండవార్ సంజయ్, సామ రూపేష్‌రెడ్డి, దేవ్‌తాళే విఠల్, వాంఖడే వామన్, మడావి చంద్రకాంత్, ఘణేశ్యాం పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి



బియ్యం పరిశీలిస్తున్న అధికారులు

ఆదిలాబాద్‌రూరల్: విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా పౌర సరఫరాల అధికారి కిరణ్ కుమార్, గురుకుల పాఠశాల, కళాశాలల ఆర్‌సీవో గోపిచంద్‌లు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలను సందర్శించారు. మధ్యాహ్న భోజనంతో పాటు నిత్యావసర సరుకులు పరిశీలించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ నాయబ్ తహసీల్దార్ బాబుసింగ్ రాథోడ్, ఇన్‌చార్జి ఎస్‌వో రమాదేవి, అధ్యాపకులు పాల్గొన్నారు.

అధికారుల పనితీరుపై ఎమ్మెల్యే ఆగ్రహం



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆత్రం సక్కు

- వాడీవేడిగా మండల సర్వసభ్య సమావేశం
- పాల్గొన్న ఎమ్మెల్యే ఆత్రం సక్కు, జెడ్పీ చైర్మన్ జనార్దన్

నార్నూర్: గాదిగూడ ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ అడ చంద్రకళ రాజు అధ్యక్షతన సోమవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం వాడీవేడిగా సాగింది. ప్రజా సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. అధికారుల పనితీరుపై ఎమ్మెల్యే ఆత్రం సక్కు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొంత మంది ఉపాధ్యాయులు జనవరి 26న జాతీయ జెండా ఆవిష్కరించలేదని సర్పంచ్‌లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఎంఈవో రాపల్లి ఆశన్న పాఠశాలను ఎందుకు తనిఖీ చేయడం లేదని ప్రశ్నించారు. రైతుబంధు, రైతుబీమా ఎంత మందికి వచ్చాయని ఏవో దివ్యను అడిగి తెలుసుకున్నారు. మిషన్ భగీరథ నీరు సక్రమంగా రావడం లేదని డీఈ శ్రీనివాస్‌ను సభ్యులు నిలదీశారు. లోద్దిగూడ, కుండి, పున్నగూడ, మారెగాం నుంచి కునికాసా, ఎంపల్లి నుంచి లోకారి, ధర్ముగూడ నుంచి పర్సువాడ బీటీరోడ్డు పూర్తి చేయాలన్నారు. జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ మాట్లాడుతూ. అధికారులు ప్రజా సమస్యలపై దృష్టి పెట్టి పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గంగుబాయి, వైస్ ఎంపీపీ యోగేశ్, ఎంపీడీవో సాయిప్రసాద్, అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ప్రచార కార్యదర్శికి సన్మానం

బోథ్: బోథ్ నియోజకవర్గ ప్రచార కమిటీ కార్యదర్శిగా ఇటీవల నియమాకం అయిన రామయి సదానందంను మండలంలోని సొనాలలో బీఆర్‌ఎస్ నాయకులు సోమవారం సన్మానించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ పాటిల్ అమృత్ రావ్, సత్యనారాయణ, మునేశ్వర్, బోరిగాం రాజారాం, బాలాజీ, నానక్ సింగ్, గణేష్, రాజు పాల్గొన్నారు.

వైద్య శిబిరం

బోథ్: మండలంలోని వజ్జర్ గ్రామంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసీలకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. సీనియర్ మెడికల్ అధికారి గంగాదాస్, సర్పంచ్ భూంబాయి, మహేందర్, ఏఎన్‌ఎం అనసూయ, లక్ష్మి, సుజాత పాల్గొన్నారు.

సన్మానం

ఆదిలాబాద్‌టౌన్: ఉత్తమ ఎన్జీవోగా కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న దుర్గం ట్రస్ట్ చైర్మన్ దుర్గం శేఖర్‌ను సోమవారం ఆయన స్నేహితులు సన్మానించారు. కార్యక్రమంలో సయ్యద్ సాజీదొద్దీన్, సంజీవ్‌కుమార్, జంగిలి ప్రశాంత్, జాడి సుధాకర్, గంగారెడ్డి, అష్రాఫ్, మహేందర్ పాల్గొన్నారు.

నేడు మైనార్టీ రుణాల ఎంపిక కోసం లక్కీడ్రా

నేరడిగొండ: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఉదయం 11.30 గంటలకు మైనార్టీ రుణదారుల ఎంపిక కోసం లక్కీడ్రా నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీవో అబ్దుల్ సమద్ ఒక ప్రకటనలో తెలిపారు. రుణాలకు సంబంధించి ఇదివరకు దరఖాస్తు చేసుకున్న 117 మంది దరఖాస్తుదారులు లక్కీడ్రాకు హాజరు కావాలని కోరారు. 2 యూనిట్లు మాత్రమే ఉండడంతో లక్కీడ్రా ఎవరికి వస్తుందోననే ఆసక్తి నెలకొంది.

అభివృద్ధి పనులపై తీర్మానం

బోథ్: బోథ్ మేజర్ గ్రామ పంచాయతీ గ్రామసభను సర్పంచ్ సురేందర్ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా 2023- 24 సంవత్సరానికి అభివృద్ధి ప్రణాళికపై చర్చించి అభివృద్ధి పనులు తీర్మానించారు. అనంతరం గాంధీ వర్ధంతిని నిర్వహించారు. కుష్ఠు నివారించేందుకు కృషి చేయాలని పాలకవర్గ సభ్యులతో సీహెచ్‌వో మనీషా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు నల్ల గంగయ్య, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు, ఐకేపీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.